సాక్షి
రంగారెడ్డి
మంగళవారం ♦ 4 ♦ ఫిబ్రవరి ♦ 2025



వర్గీకరణ చేయకుంటే..

వర్గీకరణకు రేవంత్‌రెడ్డి సర్కారు కట్టుబడి ఉండాలని, లేదంటే సునామీ సృష్టిస్తామని ఎమ్మార్పీఎస్ నేతలు హెచ్చరించారు. 8లో▸



రైతు సంక్షేమానికి కృషి

రైతు సంక్షేమానికి కేంద్రం కృషి చేస్తోందని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి అన్నారు. 8లో▸



స్థలం.. వివాదాస్పదం

అధికారుల నిర్ణయాలతో ఆఖరి మజిలీలో అవస్థలు తప్పడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8లో▸

పదవుల సందడి

సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని ఎంపిక చేసే అవకాశం

ప్రధాన పార్టీల్లో పోటాపోటీ — జిల్లా అధ్యక్ష రేసులో నిలిచేదెవరో.. — అధిష్టానాలను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు — ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీలో జిల్లా అధ్యక్షుల ఎన్నికల సందడి మొదలైంది. ఆయా పార్టీల్లోని సీనియర్ నేతలు జిల్లా అధ్యక్ష పదవి కోసం పోటీపడుతున్నారు. పార్టీకి సేవ చేసే అవకాశం తమకంటే తమకే కల్పించాలని కోరుతూ అధిష్టానాలకు విజ్ఞప్తి చేసుకుంటున్నారు. ఎవరివారు సీనియర్ నేతల ద్వారా సిఫార్సు చేయించుకుంటున్నారు. ఇప్పటి వరకు పార్టీ కోసం చేసిన సేవ, కష్టకాలంగా ఏ విధంగా అండగా నిలబడింది వివరించే ప్రయత్నం చేస్తున్నారు. ఆయా పార్టీల అధిష్టానాలు సంస్థాగతంగా మరింత బలపడేందుకు సామాజిక సమీకరణల వారీగా అధ్యక్షులను ఎంపిక చేసే కసరత్తు మొదలు పెట్టాయి. కాంగ్రెస్, బీజేపీలో అధ్యక్ష ఎన్నిక అంతర్గతంగా రాజకీయ వేడిని రగులుస్తుంటే.. ప్రతిపక్ష బీఆర్ఎస్ మాత్రం ఇప్పటి వరకు పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించకపోవడం గమనార్హం. కేవలం అంశాల వారీగా అప్పటికప్పుడు ఆందోళనలు చేపట్టడం వరకే పరిమితం అవుతోంది.

బీజేపీలో ఎడతెగని ఉత్కంఠ

రూరల్ జిల్లా అధ్యక్షుడిగా బొక్క నర్సింహారెడ్డి వరుసగా నాలుగు సార్లు పని చేశారు. ప్రస్తుతం ఆయనకు మళ్లీ అవకాశం ఉండకపోవచ్చని భావిస్తున్నారు. జాతీయ కిసాన్‌మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ పాపయ్యగౌడ్ సహా రాజేంద్రనగర్ కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి, సీనియర్ నేత మిద్దె సుదర్శన్‌రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాష అధ్యక్ష పదవి రేసులో ఉన్నారు. సామాజిక సమీకరణాల్లో భాగంగా ఎస్సీకి చోటు కల్పిస్తే కొప్పు బాష జిల్లా అధ్యక్షుడిగా ఎంపికయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. ఇక రంగారెడ్డి అర్బన్ జిల్లా నుంచి ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి మళ్లీ తనకే అవకాశం ఇవ్వాలని కోరుతుండగా, వనంపల్లి శ్రీనివాసరెడ్డి (మంచాల), వసంతకుమార్ యాదవ్ (శేరిలింగంపల్లి) అధ్యక్ష పదవి ఆశిస్తున్నారు. జిల్లాలో ఒక చోట ఓసీకి ఇస్తే.. మరో చోట బీసీ/ ఎస్సీకి ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.



బీఆర్ఎస్‌లో వీడని స్తబ్ధత

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా మూడేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని అధిష్టానం ప్రకటించింది. జిల్లా కమిటీ, మండల కమిటీ, గ్రామ, వార్డు కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినా ఇప్పటి వరకు ఆచరణలో అమలు కాలేదు. ఆయన పూర్తిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికే పరిమితం అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం మినహా మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, చేవెళ్లలో బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఆ తర్వాత రాజేంద్ర నగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వలసలను నిలువరించే ప్రయత్నం కూడా చేయలేదు. సంస్థాగతంగా పార్టీకి బలమైన కమిటీలు లేకపోవడంతో నాయకులు, కార్యకర్తలు ఎవరికి వారే అన్నట్లుగా ఉన్నారు. మాజీ మంత్రి సబితా రెడ్డి పార్టీకి పెద్ద దిక్కుగా నిలుస్తున్నారు.

కాంగ్రెస్‌లో తీవ్ర పోటీ

ప్రస్తుత కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి కార్పొరేషన్ పదవి అప్పగించారు. ఇప్పటికే ఆయన రెండు సార్లు జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన కూడా ఇక ఆ పదవి నుంచి తప్పుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా అధ్యక్షుడిగా అంటీముట్టనట్లు ఉంటున్నారు. ఆయన స్థానంలో మరో సీనియర్ నేతను నియమించాలని పీసీసీ భావిస్తోంది. ఇప్పటికే అంతర్గత సర్వేలు కూడా చేపట్టింది. మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నేత దేప భాస్కర్ రెడ్డి (ఓసీ), చేవెళ్ల నియోజకవర్గం నుంచి భీం భరత్ (ఎస్సీ) సహా సీనియర్ నేత గౌరీ సతీష్ (బీసీ), రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి వేణుగౌడ్(బీసీ) అధ్యక్ష పదవి రేసులో ఉన్నట్లు సమాచారం. సామాజిక సమీకరణాలను బట్టి పార్టీ అధ్యక్షులను ఎంపిక చేస్తే.. వీరిలో ఎవరో ఒకరికి పార్టీ పగ్గాలు చేపట్టే అవకాశం దక్కనుంది. ఫిబ్రవరి రెండో వారంలో అధ్యక్ష ఎంపిక ప్రక్రియ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

నిధులివ్వకుండా చేతులు కట్టేశారు



సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

- గత ప్రభుత్వంలో కేటాయించినవి సైతం వెనక్కి తీసుకున్నారు
- సీఎం రేవంత్‌రెడ్డి ఏం ఆలోచిస్తున్నారో తెలియదు
- ఎమ్మెల్యే సబితా రెడ్డి

పహాడీషరీఫ్: రాష్ట్రంలోని ఎమ్మెల్యేలకు చిల్లి గవ్వ ఇవ్వకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులు కట్టేశారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా రెడ్డి విమర్శించారు. కేసీఆర్ హయాంలో నియోజకవర్గ అభివృద్ధికి ఒక్కో ఎమ్మెల్యేకు రూ.5 కోట్లు ఇచ్చేవారని, ఈ సీఎం ఏం ఆలోచిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలో జై భీం పాదుపు సంఘం నూతన భవనాన్ని సోమవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి 14 నెలల కాలంలో 100 రోజులకు పైగా ఢిల్లీ, ఇతర దేశాల్లోనే తిరిగాడన్నారు. ఆయన వైఖరి కారణంగానే హైదరాబాద్ నగరంలో పెట్టుబడులు ఆగిపోయాయని ఆరోపించారు. ప్రజా పాలన, సర్వేల పేరుతో ఈ ప్రభుత్వం నాటకాలాడడం మినహా ప్రజలకు ఒరిగిందేమీలేదన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఎన్నికలకు ముందు మంజూరు చేసిన రూ.270 కోట్ల నిధులను రద్దు చేసిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కిందని ఎద్దేవా చేశారు. మినీ ఇండియాగా పేరున్న శ్రీరాం కాలనీ ప్రజలు కులాల వారీగా పాదుపు సంఘాలు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదుగుతుండడం అభినందనీయమన్నారు. ఇక్కడ అన్ని కులాలకు స్థలాలు కేటాయించామని, భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తే ఈ ప్రభుత్వం వెనక్కి తీసుకుందని దుయ్యబట్టారు. తిరిగి కేసీఆర్ అధికారంలోకి వచ్చాక కచ్చితంగా నిర్మించి ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాదుపు సంఘం అధ్యక్షుడు రావులగల్ల యాదగిరి, కార్యదర్శి బాలరాజ్, సభ్యులు యంజాల అర్జున్, చెన్నం రాజేష్, డి.శ్రీనివాస్, జి.సంధ్య, భద్రమ్మ, కమిషనర్ వెంకట్రామ్, జల్‌పల్లి మాజీ సర్పంచ్ సూరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాతను చూసేందుకు వెళ్తూ..



గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు (ఇన్‌సెట్లో) శ్రీనివాస్ (ఫైల్)

- ఏఆర్ కానిస్టేబుల్ దుర్మరణం
- అడవి పంది బైక్‌ను ఢీకొనడంతో ప్రమాదం
- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- ఎమ్మెల్యే యాదయ్యకు గన్‌మెన్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్

శంకర్‌పల్లి: సెలవు రోజున తాతను చూసేందుకు వెళ్తున్న ఓ ఏఆర్ కానిస్టేబుల్‌ను అడవి పంది రూపంలో వచ్చిన మృత్యువు వెంటాడింది. ఈ సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకోగా.. సోమవారం ఉదయం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. శంకర్‌పల్లి మున్సిపల్ పరి ది లోని బుల్కాపూర్‌కు చెందిన ముత్తంగి యాదయ్య, అమృతమ్మ దంపతులకు నలుగురు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు బుచ్చిరాజు కానిస్టేబుల్ కాగా.. మరో ఇద్దరు కుమారులు నగేష్, శ్రీకాంత్ వ్యవసాయం చేస్తున్నారు. నాలుగో కొడుకు శ్రీనివాస్ (30) 2018లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికై .. వికారాబాద్ జిల్లాలో పని చేస్తున్నాడు. తండ్రి సెంట్రింగ్ సామగ్రిని అద్దెకు ఇస్తుంటాడు. తల్లి నాలుగేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయింది.

నాలుగేళ్లుగా ..

శ్రీనివాస్ నాలుగేళ్లుగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సెలవు కావడంతో తన తాతను కలిసేందుకు రాత్రి వేళ సంగారెడ్డి జిల్లా రాంచంద్రాపురం మండలం వెలిమల గ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. వెలిమలతండా సమీపంలో ఇతని బైక్‌ను అడవి పంది బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం స్థానికులు గమనించి బీడీఎల్- భానూరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎమ్మెల్యే పరామర్శ

శ్రీనివాస్ మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యాదయ్య పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నాలుగేళ్లుగా శ్రీనివాస్‌తో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకున్నారు.

అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

వికారాబాద్ పోలీసులు అధికారిక లాంఛనాలతో శ్రీనివాస్ అంత్యక్రియలు నిర్వహించారు. గాలిలో మూడు రౌండ్లు కాల్పులు జరిపి నివాళులర్పించారు. ఆఖరి చూపుకోసం బంధువులు, మిత్రులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వికారాబాద్ ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్ఐ డేవిడ్ విజయ్‌కుమార్, ఆర్ఎస్ఐ శ్రీశైలం, రాము, శ్రీనివాస్ బాబు తదితరులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

తెలంగాణపై వివక్ష



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

- కేంద్ర బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం
- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి
- కలెక్టరేట్ ఎదుట నిరసన గళం

ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపిందని, నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం చేసిందని టీయుఎఫ్ఐడీసీ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద డీసీసీ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. స్థూల దేశీయోత్పత్తి కి 5 శాతం వాటా అందిస్తున్న తెలంగాణను కేంద్రం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. రాష్ట్ర సమస్యలు, అభివృద్ధి అంశాలను పట్టించుకోలేదన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేంద్ర మంత్రులు, సహాయ మంత్రులు ఉన్నా దండగేనన్నారు. వెంటనే వారు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. మూసీ ప్రక్షాళన చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామంటే అడ్డుపడే బీజేపీ ఎంపీలు బడ్జెట్‌లో అన్యాయం జరుగుతుంటే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. కేంద్రం నుంచి నిధులు తీసుకురాని అసమర్థులు బీజేపీ ఎంపీలని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మదుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామ్మోహన్‌గౌడ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, గుడ్డిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ మల్లేష్, ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, నాయకులు గజ్జి భాస్కర్, దేపా భాస్కర్‌రెడ్డి, యోగేశ్వర్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డి, చిగురింత పారిజాత, ఇబ్రహీంపట్నం సీనియర్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, కిషన్, సమత, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులను నివారిద్దాం

కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ఈ నెల 10న తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విస్తత స్థాయిలో చేపట్టాలని కోరుతూ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నులిపురుగులతో పిల్లల్లో ఎదుగుదల లోపించడం, మందబుద్ధి, రక్తహీనత, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం వంటి రుగ్మతలకు లోనవుతారన్నారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం ఏటా రెండు పర్యాయాలు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 10న జిల్లా వ్యాప్తంగా అన్ని వసతిగృహాలు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, కిశోర బాలబాలికల సంఖ్యకు అనుగుణంగా ప్రతి ఒక్కరికీ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేలా పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లాలో ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన 8.60 లక్షల మంది పిల్లలకు మాత్రలు వేయాలన్నారు. గ్రామాల్లో టాంటాం వేయించాలని సూచించారు. పాఠశాలల నుంచి జూనియర్ కళాశాల వరకు అందరికీ మాత్రలు అందించాలన్నారు. వైద్య, విద్యాశాఖతో పాటు ఐసీడీఎస్, సంక్షేమ శాఖల అధికారులు సమష్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ సంగీత, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు చెప్పుకోవడానికి ప్రజావాణికి వచ్చే అర్జీదారుల ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో పెట్టొద్దని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులకు సంబంధిత శాఖల అధికారులు తక్షణమే పరిష్కారం చూపించాలని సూచించారు. మొత్తం 62 దరఖాస్తులు అందాయన్నారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 44, ఇతర శాఖలకు సంబంధించి 18 ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపాలిటీ అధికారులు, మండల తహసీల్దార్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.


తహసీల్ కార్యాలయానికి తాళం వేసి నిరసన



గేట్ వద్ద బైఠాయించిన కాంట్రాక్టర్ దానయ్య

ఇబ్రహీంపట్నం: చేసిన పనులకు రాకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయానంటూ ఓ కాంట్రాక్టర్ వినూత్న పద్ధతిలో నిరసన వ్యక్తం చేశాడు. తాను నిర్మించిన భవనానికి తాళం వేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించేందుకు పాత భవనాన్ని కూల్చివేశారు. అప్పటి వరకు తాత్కాలిక ఆఫీసు కోసం నిర్మాణ దశలో ఉన్న జెడ్పీ గెస్ట్ హౌస్‌ను ఎంచుకున్నారు. అసంపూర్తిగా ఉన్న గెస్ట్ హౌస్ పనులను ఆగమేఘాల మీద పూర్తి చేయాలంటూ ఆర్‌అండ్‌బీ అధికారులు.. కాంట్రాక్టర్ దానయ్యకు పనులు అప్పగించారు. 2022 జనవరిలో ఇందుకు సంబంధించిన పనులు పూర్తికావడంతో తహసీల్దార్ కార్యాలయాన్ని అందులోకి షిఫ్ట్ చేశారు. పనులు చేసి మూడేళ్లు గడిచినా బిల్లులు చెల్లించకపోవడంతో దానయ్య సోమవారం ఉదయం తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసి ఆందోళనకు దిగాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌అండ్‌బీ అధికారుల సూచన మేరకు రూ.50 లక్షలతో జెడ్పీ గెస్ట్ హౌస్ భవనాన్ని పూర్తి చేశానని తెలిపారు. వెంటనే బిల్లులు చెల్లిస్తారనే ఉద్దేశంతో వడ్డీకి అప్పులు తెచ్చి పనులు చేశానన్నారు. వడ్డీ తడిసి మోపెడు కావడంతో తన 20 గుంటల భూమితో పాటు యంజాల్‌లోని ఓ ప్లాట్‌ను విక్రయించానని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా అప్పులు తీరక తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యా యత్నం చేయగా.. కుటుంబ సభ్యులు గమనించి కాపాడారన్నారు. ప్రస్తుతం కంప్రెషర్ వాహనంపై దినసరి కూలీగా పని చేస్తున్నానని వాపోయాడు. ఏంచేయాలో తోచక తహసీల్దార్ కార్యాలయానికి తాళం పెట్టానని, బిల్లులు వచ్చేలా చూడాలని అభ్యర్థించారు. విధులకు హాజరయ్యే సమయంలో తాళం వేయడంతో తహసీల్దార్ సునీతారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారువచ్చి కాంట్రాక్టర్‌తో మాట్లాడి కార్యాలయం తాళం తీయించడంతో వ్యవహారం సద్దుమణిగింది. విషయాన్ని కలెక్టర్‌తో పాటు ఆర్‌అండ్‌బీ అధికారులకు తెలియజేశామని తహసీల్దార్ తెలిపారు.

జారిపడ్డ మేయర్



బంజారాహిల్స్: గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి తృటిలో ప్రమాదం తప్పింది. సోమవారం సాయంత్రం పంజగుట్ట సర్కిల్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సుందరీకరణ పనులను ప్రారంభించారు. అనంతరం రోడ్డుకు అవతలి వైపు ఉన్న ఫుట్‌పాత్‌ను ఆధునీకరించారని.. పరిశీలించాలని కోరగా అక్కడికి మంత్రితో వెళ్లిన గద్వాల్ విజయలక్ష్మి ఫుట్‌పాత్‌ను తగిలి కిందపడ్డారు. పక్కనే ఉన్న డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి వెంటనే మేయర్‌ను పైకి లేపారు. ఈ ప్రమాదంలో మేయర్‌కు ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఆమె తన కార్యక్రమాన్ని కొనసాగించారు.

సరస్వతీ నమస్తుభ్యం



నందివనపర్తిలో చిన్నారితో అక్షరాలు దిద్దిస్తున్న శ్రీ విద్యారణ్య భారతిస్వామీజీ

అక్షరాభ్యాసం కోసం వివిధ జిల్లాల నుంచి తమ చిన్నారులతో తరలివచ్చిన తల్లిదండ్రులు



వసంత పంచమి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులతో అక్షరాలు దిద్దించి ఆశీర్వదించారు. పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. యాచారం మండలం నందివనపర్తిలోని శ్రీ జ్ఞాన సరస్వతీ దేవాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. – యాచారం



నందివనపర్తిలో ప్రత్యేక పూజలు అందుకున్న శ్రీ జ్ఞాన సరస్వతీ మాత

పల్సర్ బైక్, క్వాలిస్ ఢీ

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

మొయినాబాద్: ఎదురెదురుగా పల్సర్ బైక్, క్వాలిస్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నర్సింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన ఎండీ అస్రఫ్(30) మండల పరిధి అమ్డాపూర్‌లోని ఓ ఫాంహౌస్‌లో ఉంటూ మేస్త్రీ పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి 8.50 గంటల సమయంలో అస్రఫ్, అతని స్నేహితులు ఇమ్రాన్, అస్గర్ కలిసి భాస్కర ఆస్పత్రి వైపు నుంచి అమ్డాపూర్ వైపు పల్సర్‌పై వెళ్తున్నారు. నజీబ్‌నగర్ సమీపంలోని సురబి వెంచర్ వద్ద ఉన్న మూల మలుపువద్ద బైక్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న క్వాలిస్ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. వారిని వెంటనే చికిత్సకోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. అస్రఫ్ చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. ఇమ్రాన్, అస్గర్ చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం


విద్యార్థులతో కరాటే మాస్టర్లు

చేవెళ్ల: ఆత్మరక్షణతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకునేందుకు కరాటే దోహదపడుతుందని కరాటే మాస్టర్ కృష్ణ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన మాస్టర్ జపాన్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో 6వ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే కుంగ్‌ఫూ ఛాంపియన్ పోటీలలో చేవెళ్ల విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ చూపారని చెప్పారు. పర్పుల్ బెల్ట్ విభాగంలో జశ్వంత్ కుమార్ మొదటి స్థానంలో నిలిచి బంగారు పథకం అందుకున్నాడని తెలిపారు. కట్టా విభాగంలో రిజ్వానబేగం, అయాన్, పద్మావతి, సాయిగణేశ్, దేవరాజ్ మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో కృతిక్‌రాజ్, నాగశివ, మణి దీక్షిత్, లోకేశ్, సిద్ధు అక్బర్‌లు పలు బెల్టుల విభాగాల్లో విజయం సాధించినట్లు చెప్పారు. విజేతలకు స్పీకర్ ప్రసాద్ కుమార్ బహుమతులు ప్రదానం చేశారని పేర్కొన్నారు.

కరాటేలో అక్కాచెల్లెళ్ల ప్రతిభ


మెడల్ అందుకుంటున్న హర్షిని

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధి పెద్దమంగళారంకు చెందిన అక్కా చెల్లెళ్లు అంతర్జాతీయ కరాటే పోటీల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. నాంచేరి మహానందంగౌడ్, శ్రీవెన్నెల దంపతుల కూతుర్లు వైష్ణవి, హర్షిని ఈ ఘనత సాధించారు. స్థానిక పాఠశాలలో వైష్ణవి 6, హర్షిని 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులు.. గ్లోవింగ్ షోటోకాన్ కరాటే అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. ఇటీవల ఏపీలోని విశాఖపట్నంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో తలపడి సత్తాచాటారు. ఇరువురిని కోచ్ సుధాకర్, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

బుగ్గ కార్లపై కన్నేది?

- ఇబ్బడిముబ్బడిగా లైట్లతో కూడిన వాహనాలు
- సైరన్‌తో దూసుకెళ్తున్న మరి కొన్ని వాహనాలు
- అనర్హులు వాడితే చర్యలు తీసుకునే అవకాశం
- పట్టనట్లు వ్యవహరిస్తున్న ట్రాఫిక్ పోలీసులు
- ఎవరు వినియోగించాలన్న అంశంపై సందిగ్ధత





సాక్షి, సిటీబ్యూరో: అద్దాలపై పరిమితికి మించిన రంగుతో కూడిన ఫిల్మ్ వేసుకుని సంచరిస్తున్న వాహనాలే కాదు... టాప్‌పై ఎరుపు, నీలి రంగు లైట్లు (బుగ్గలు), సైరన్లు పెట్టుకుని సంచరిస్తున్న వాహనాలకు కొదవే లేదు. వీటి వినియోగం కేవలం నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదు... భద్రత పరంగానే పెను సవాలే. అయినా మూడు కమిషనరేట్లకు చెందిన ట్రాఫిక్ విభాగం అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తొలుత తేలికపాటి వాహనాలైన కార్లు తదితరాల టాపులపై ఈ బుగ్గలు పెట్టుకోవడానికి ఎవరు అనర్హులనే దానిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ఎక్కడికైనా దూసుకెళ్లే అవకాశం...

సాధారణంగా ఈ తరహా లైట్లు, సైరన్‌తో వచ్చే వాహనాలను చూసి సామాన్యులే కాదు పోలీసులు కూడా అప్రమత్తం అవుతారు. సాధారణ వాహనచోదకులు దారి ఇవ్వడానికి ప్రయత్నిస్తే... వాటిని ఆపడానికి విధుల్లో ఉన్న పోలీసులు సైతం సాధారణంగా ప్రయత్నించరు. ఆయా వాహనాల్లో ప్రముఖులు ఉంటారనే భావనే దీనికి ప్రధాన కారణం. దీనిని ఆసరాగా చేసుకునే కొందరు అనర్హులు, ఆకతాయిలు తమ వాహనాలపై ఈ తరహా లైట్లు పెట్టుకుని సంచరిస్తుంటారు. 2001లో ఢిల్లీలోని పార్లమెంట్‌పై దాడి చేసిన ఉగ్రవాదులు ఇలాంటి లైట్లు ఉన్న వాహనాలనే వాడారు. ఈ తరహా లైట్లు, సైరన్లు ఉన్న కారణంగానే భద్రతా సిబ్బంది కూడా ఆ వాహనాలను పార్లమెంట్ ఆవరణలోకి రాకుండా అడ్డుకోలేదు.

వినియోగిస్తున్న వారిలో 90 శాతం అనర్హులే...

ఈ తరహా లైట్లు, సైరన్లు వినియోగిస్తున్న వారిలో 90 శాతం అనర్హులే ఉంటున్నారు. సెంట్రల్ మోటారు వెహికిల్ రూల్స్–1989 ప్రకారం కేవలం 43 మంది వీవీఐపీలు మాత్రమే వీటిని వినియోగించాలి. అయితే అసెంబ్లీ, సెక్రటేరియేట్‌తో పాటు కొన్ని శాఖలకు చెందిన ఉన్నతాధికారులు తమ వాహనాలపై ఎరుపు, నీలం లైట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. పలువురు వీఐపీలు సైతం ఈ లైట్లు, సైరన్లను అక్రమంగా వినియోగిస్తున్నారు. స్పెషల్ సెక్రటరీ హోదాలో ఉన్న అధికారులకు కూడా తమ కార్లపై ఈ తరహా లైట్లు పెట్టుకునే అవకాశం లేదు. అయినప్పటికీ వివిధ హోదాలకు చెందిన వాళ్లు వీటిని వినియోగిస్తున్నారు. అధికారుల పరిస్థితే ఇలా ఉంటే ఇక సామాన్యుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఈ లైట్లు, సైరన్ కలిగి ఉండటం హోదాగా భావించే వాళ్లు అనేక మంది ఉంటున్నారు.

ఎవరు వినియోగించాలంటే...

ఫ్లాషర్‌తో కూడిన రెడ్‌లైట్

రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని, మాజీ రాష్ట్రపతులు, ఉప ప్రధాని, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా, లోక్‌సభ స్పీకర్, కేంద్ర క్యాబినెట్ మంత్రులు, ప్లానింగ్ కమిషనర్ ఉపాధ్యక్షుడు, మాజీ ప్రధానులు, ఉభయసభల ప్రతిపక్ష నేతలు, సుప్రీం కోర్టు జడ్జిలు (వీరు దేశ వ్యాప్తంగా ఎక్కడైనా ఈ లైట్‌తో తిరగవచ్చు.)

ఫ్లాషర్ లేని రెడ్‌లైట్:

చీఫ్ ఎలక్షన్ కమిషనర్, కాగ్, ఉభయసభల ఉపాధ్యక్షులు, కేంద్ర సహాయ మంత్రులు, ప్లానింగ్ కమిషన్ సభ్యులు, అటార్నీ జనరల్, క్యాబినెట్ సెక్రెటరీ, త్రివిధ దళాల అధిపతులు, కేంద్ర డిప్యూటీ మంత్రులు, క్యాట్ చైర్మన్, మైనార్టీ కమిషన్ చైర్మన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ల అధ్యక్షులు, యూపీఎస్సీ చైర్మన్ (వీరు దేశ వ్యాప్తంగా ఎక్కడైనా ఈ లైట్‌తో తిరగవచ్చు.)

కేవలం రెడ్‌లైట్:

రాష్ట్ర గవర్నర్, గవర్నర్ ఎస్కార్ట్ వాహనాలు, సీఎస్, డీజీపీ, సీజే ఆఫ్ తెలంగాణ, హైకోర్టు జడ్జిలు, లోకాయుక్త, టీజీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ చైర్మన్, క్యాట్ వైస్ చైర్మన్.

బ్లూ లైట్...

ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, అసెంబ్లీ స్పీకర్–డిప్యూటీ స్పీకర్, కౌన్సిల్ చైర్మన్, ఉపాధ్యక్షుడు
- వాహనంలో సదరు ప్రముఖులు ఉన్నప్పుడు మాత్రమే లైట్ వినియోగించాలని, లేని పక్షంలో దానిపై నల్ల కవర్ తప్పనిసరిగా వేయాలి.



డీఎస్పీకి అభినందనలు



సాక్షి, సిటీబ్యూరో: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటిన తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ ఏఎన్‌బీ) డీఎస్పీ కె.నర్సింగ్‌రావును డైరెక్టర్ సందీప్ శాండిల్య సోమవారం అభినందించారు. కరీంనగర్‌లో గత మంగళవారం నుంచి శనివారం వరకు తెలంగాణ స్టేట్ పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ జరిగింది. 105 కేజీల పవర్ లిఫ్టింగ్ విభాగంలో పాల్గొన్న నర్సింగ్‌రావు బంగారు పతకం సాధించారు. ఈ నేపథ్యంలోనే ఆయన సోమవారం సందీప్ శాండిల్యను కలిశారు. నర్సింగ్‌రావును అభినందించిన ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

కారు అదుపుతప్పి యువకుడి మృతి

కీసర: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లాలోనిగూడకు చెందిన వేల్పుల మహేష్ (31) ఆదివారం రాత్రి రాంపల్లి దాయర సమీపంలో దావత్‌కు వెళ్లి వస్తుండగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జయింది. కారులో ఇరుక్కున్న మహేష్‌ను అతికష్టం మీద బయటికి తీసిన పోలీసులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కేసు నమోదులో ఉంది.

మద్యానికి బానిసై యువకుడు..

ఘట్‌కేసర్: మద్యానికి బానిసైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరుశురాం కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ద్వారకనగర్‌కు చెందిన శేఖర్ (32) డ్రైవర్‌గా పని చేసేవాడు. కొన్నాళ్లుగా మద్యానికి బానిసైన అతను తరచూ కుటుంబ సభ్యులు, భార్యతో గొడవ పడేవాడు. దీంతో అతడి భార్య వేరుగా ఉంటోంది. శనివారం రాత్రి చిన్న చెరువు సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం రాత్రి గుర్తించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదులో ఉంది.


మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి తదితరులు

రైతు సంక్షేమానికి కేంద్రం కృషి

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి

షాబాద్: రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణరెడ్డి అన్నారు. మోదీ సర్కార్.. కర్షకులకు ఎంతో మేలు చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒకేఒక గ్రామంలో రైతుభరోసా ఇవ్వడం విచారకరమని పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ నక్ష పటంలో ఉన్న రెవెన్యూ రికార్డుల్లో బాటలు, కాలువలు, గ్రామీణ ఉపాధి పథకం కింద చేర్చి, వాటిని సంరక్షించాలని సూచించారు. ప్రభుత్వ ఆధీనంలోని వ్యవసాయేతర భూములను కాపాడుతూ, వాటిల్లో మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో సంఘ్ జిల్లా కమిటీ సభ్యుడు వెంకట్‌రెడ్డి, షాబాద్ గ్రామ కమిటీ అధ్యక్షుడు గౌతం, రైతులు బీమయ్య, సందీప్, బందిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

మీర్‌పేట: మహిళ మెడలోని గొలుసును స్నాచర్ అపహరించిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మీర్‌పేట టీఎస్ఆర్‌నగర్‌లో నివాసముండే ఉడతల యాదమ్మ(65) స్థానికంగా వస్త్ర దుకాణం నిర్వహిస్తోంది. సోమవారం ఉదయం షాపు వద్దకు వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి కొనుగోలు దారుడిగా వచ్చి, ఆమె మెడలోని ఐదున్నర తులాల బంగారు గొలుసును తెంపుకొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నర్సింగ్ మాజీ సూపరింటెండెంట్ మృతి

షాద్‌నగర్‌రూరల్: అనారోగ్యంతో నర్సింగ్ మాజీ సూపరింటెండెంట్ మృతి చెందారు. పట్టణంలోని క్రిస్టియన్ కాలనీకి చెందిన ఎస్‌డి హెలెన్ రూత్(70) ఆరోగ్య సమస్యలతో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. ఆమె 1985 నుంచి 2007 వరకు షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో హెడ్‌నర్సుగా, ఆ తర్వాత నగరంలోని కోఠి మెటర్నిటీలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. ఆమె అంత్యక్రియలను మంగళవారం షాద్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కంచెలో చెలరేగిన మంటలు


మంటలను ఆర్పుతున్న పోలీసులు

యాచారం: కంచెలోని గడ్డికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టగా.. చెలరేగిన మంటలను ఆర్పేందుకు పోలీసులు ముప్పతిప్పలు పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారిపై యాచారం– నక్కగుట్ట తండాల మధ్యన సోమవారం కొందరు వ్యక్తులు పొలాల్లోని గడ్డికి నిప్పుపెట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు.. మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో ఇబ్రహీంపట్నం నుంచి ఫైరింజన్‌ను తెప్పించి మంటలను పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

స్థలం కేటాయింపు.. వివాదాస్పదం

- శ్మశాన వాటిక స్థలం.. బంజారా భవనానికి!
- ప్రొసీడింగ్ జారీ చేసిన ఆర్డీఓ
- వ్యతిరేకిస్తున్న స్థానికులు..


బడంగ్‌పేట శ్మశానవాటిక

బడంగ్‌పేట్: శ్మశానవాటిక స్థలం కొంత మేర బంజార భవనానికి కేటాయించడంతో వివాదాస్పదంగా మారింది. చివరకు బొందల గడ్డను.. కులాల పేరిట పంపకాలు చేస్తున్నారని, అధికారుల నిర్ణయాలతో ఆఖరి మజిలీలో అవస్థలు తప్పడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 110 సర్వే నంబర్‌లోని హిందూ శ్మశాన వాటిక స్థలంలో కొంత భాగాన్ని బడంగ్‌పేట్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్‌కు కేటాయిస్తూ కందుకూర్ ఆర్డీఓ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఎల్ఆర్ నం. బి/3212/24తో గత ఏడాది ఏప్రిల్ 24న ఆయన సంతకంతో కూడిన ప్రొసీడింగ్‌ను జారీ చేయగా.. స్థానిక ప్రాంత ప్రజలు అధికారి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ప్రొసిడింగ్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రద్దు చేయాలి

సర్వే నంబర్ 110లో కాస్ర పహానీ (1954, 55) లెక్కల ప్రకారం 6.23 ఎకరాలు ఖారిజ్‌ఖాతా(బరియల్ గ్రౌండ్) కేటాయించినట్లు ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. నాటి నుంచి ధరణి పహాని 2023– 24 వరకు కొనసాగుతోంది. ప్రస్తుతం బడంగ్‌పేటతో పాటు చుట్టూ 150కి పైగా కాలనీలు వెలిశాయి. ఇక్కడి వారిలో ఎవరైనా కాలం చేస్తే.. ఇదే శ్మశాన వాటికలో అంత్యక్రియలు చేస్తుంటారు. ఇదిలా ఉండగా.. గతేడాది వైకుంఠధామాల పేరుతో రూ.2.50 కోట్లతో బడంగ్‌పేట శ్మశాన వాటికను అభివృద్ధి చేశారు. చుట్టూ ప్రహరితో పాటు కావలసిన సౌకర్యాలు కల్పించారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. శ్మశాన వాటిక నుంచి 5వందల గజాల స్థలాన్ని బంజారా వెల్ఫేర్ అసోసియేషన్‌కు కేటాయిస్తున్నట్లు ప్రొసిడింగ్‌ను జారీ చేసిన వెలుగు చూడటంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రజాప్రతినిధులు కల్పించుకుని స్థలాన్ని కాపాడాలని కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయకుంటే యుద్ధమే


అంబేడ్కర్ విగ్రహానికి నివాలర్పిస్తున్న సమితి నాయకులు

ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ

షాబాద్: ఎస్సీ వర్గీకరణకు రేవంత్‌రెడ్డి సర్కారు కట్టుబడి ఉంటే ఈ నెల 7వ తేదీకి ముందే నిర్ణయం తీసుకోవాలని, లేదంటే హైదరాబాద్‌లో సునామి సృష్టిస్తామని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మద్దిలేటి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్‌రావు మాదిగ హెచ్చరించారు. సోమవారం మండల పరిధి లక్ష్మరావుగూడలోని ఓ గార్డెన్‌లో నిర్వహించిన సమితి కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. వర్గీకరణ చేయకపోవడంతో ఇటీవల భర్తీ చేసిన ప్రభుత్వ ఉద్యోగాల్లో మాదిగ, మాదిగ ఉపకులాల నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకుడు నర్సిహులు, జోగు వెంకటయ్య మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎస్సీ వర్గీకరణ అమలు చేసే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని పేర్కొన్నారు. వేల గొంతులు. లక్ష డప్పుల సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి సీనియర్ నాయకులు విశ్వంమాదిగ, జిల్లా నాయకులు అశోక్‌కుమార్, రామకృష్ణ, నాయకులు నర్సింగ్‌రావు, రాజు, నర్సింహులు, ప్రవీణ్, శ్రీనివాస్, వెంకటయ్య, ఆంజనేయులు, బాల్‌రాజు, శ్రీశైలం, సతీష్, కిష్టయ్య, నరేందర్ తదితరులు ఉన్నారు. అనంతరం నాగర్‌గూడ కూడలి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాలర్పించారు. ఇదిలా ఉండగా.. ఎమ్మార్పీస్ షాబాద్ మండల నూతన అధ్యక్షుడిగా తాళ్లపల్లి గ్రామానికి చెందిన ఆక్కమొళ్ల జంగయ్య, అధికార ప్రతినిధిగా మల్కి ప్రవీణ్‌ను ఎనుకున్నామని సమితి జాతీయ నాయకులు తెలిపారు.

టెస్ట్ డ్రైవ్ చేస్తానని వాహనాలతో ఉడాయింపు

- ఇద్దరు బైక్ దొంగల అరెస్టు..
- పరారీలో మరొకరు
- ఆరు బైక్‌ల స్వాధీనం

జీడిమెట్ల: ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి ఉన్న బైకులు కొంటామని వచ్చి టెస్ట్‌డ్రైవ్ చేస్తామని నమ్మించి వాహనాలతో ఉడాయిస్తున్న ఇద్దరు వ్యక్తులను బాచుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ సురేష్ కుమార్, బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, డీఐ యాదయ్యతో కలిసి వివరాలు వెల్లడించారు. బాచుపల్లి, కౌసల్య కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మహేష్ తన బైక్‌ను విక్రయించేందుకు ఓఎల్ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. దీనిని చూసిన సూరారం ప్రాంతానికి చెందిన ఒంగోలు రమేష్‌బాబు, చంద్రమోలు గుండప్ప, నరసింహతో కలిసి గత నెల 23 న మహేష్ ఇంటికి వచ్చారు. రమేష్‌బాబు మహేష్‌తో మాట్లాడుతుండగా మిగతా ఇద్దరూ దూరంగా ఉన్నారు. మహేష్‌తో మాట్లాడిన అనంతరం టెస్ట్‌డ్రైవ్ చేస్తానంటూ బైక్ తీసుకెళ్లిన రమేష్ బాబు తిరిగి రాలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన మహేష్ అదేరోజు బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించిన పోలీసులు నిందితులు ముగ్గురూ మహేష్ ఇంటికి ఆటోలో వచ్చినట్లు గుర్తించి వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు. ఆదివారం చోరీ చేసిన బైక్‌పై తిరుగుతున్న రమేష్, గుండప్పలను అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులు ఇదే తరహాలో బాచుపల్లిలో 3, మియాపూర్‌లో, జగద్గిరిగుట్ట, మియాపూర్ ప్రాంతాల్లో ఒకటి చొప్పున బైక్‌ల చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. వారి నుంచి 6 బైకులను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు నరసింహ పరారీలో ఉన్నట్లు తెలిపారు. చాకచక్యంగా కేసును ఛేదించిన కానిస్టేబుళ్లు అంజయ్య, కనకయ్యలను డీసీపీ అభినందించి రివార్డులు అందజేశారు.